క్లుప్తంగా

బడి దేవరమ్మకు పూజలు

పార్వతీపురం టౌన్: మండల ప్రజల ఆరాధ్య దేవత బడిదేవరమ్మ తల్లికి పెద్ద బొండపల్లి గ్రామ రైతులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు విస్తారంగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి పూజలు చేస్తుంటారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేసేందుకు కృషి

సాలూరు: పట్టణంలో 11వ వార్డులో ఆదివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ప్రజలకు మంచి చేసేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి డీఎఫ్ఓ ప్రసూన, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

పార్వతీపురం టౌన్: పాలస్తీనాపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు కె.రాజు అన్నారు. ఈమేరకు దాడులను నిరసిస్తూ ఆదివారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా మేదరవీధి జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.డేవిడ్, జి.సురేష్, శివ, జై. శ్రీను, అంజలి, జ్యోతి, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుడి భార్య స్వాతికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామానికి చెందిన జొన్నా శివకుమార్ ఇటీవల మృతి చెందడంతో అతని స్నేహితులు (1996 బ్యాచ్ ఇంటర్మీడియట్ విద్యార్థులు) ఆర్థిక సాయం అందజేశారు. రూ. 1.25 లక్షలు సేకరించి మృతుడి భార్య స్వాతికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొమ్మి రమేష్, నిరంజన్ మెహర్‌ప్రసాద్, తారక్, రాంబాబు, జి.వెంకటరమణ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

తవ్వేస్తున్నారు..



కొండను చదును చేసిన అక్రమార్కులు

పార్వతీపురం టౌన్: అడ్డాపుశీల కొండ నుంచి కొంతమంది అక్రమార్కులు ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. కొండను చదును చేసి రియల్ ఎస్టేట్‌గా మార్చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల కళ్ల ముందే ఇదంతా జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన



బర్లిలో జిల్లేడు ద్రావణం తయారు చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని బర్లిలో ఎంసీఆర్‌పీలు లక్ష్మి, తిరుపతిరావు ఆధ్వర్యంలో జిల్లేడు ద్రావణం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ ద్రావణం పిచికారీ చేయడం వల్ల వరి పంటకు పొటాష్, బోరాన్ లభిస్తాయని చెప్పారు. డ్రమ్ము నీటిలో 20 కిలోలకు తగ్గకుండా జిల్లేడు ఆకులను 10 నుంచి 20 లీటర్ల దేశీయ ఆవు మూత్రంలో నాలుగు రోజుల పాటు నానబెట్టాలన్నారు. ఆ తర్వాత వడగట్టి పది లీటర్ల నీటిలో రెండు లీటర్ల ద్రావణం వేసి పైరుకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు శారద, ఐసీఆర్‌పీ గంగమ్మ, రైతులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

గరుగుబిల్లి: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని రావివలస జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు, వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వెహికల్ చట్టంలోని నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. అతి వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరగాళ్లకు వ్యక్తిగత సమాచారం అందిస్తే మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదు మాయమౌతుందన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రథమ నిర్లక్ష్యం

- బస్సుల్లో కానరాని ఫస్ట్ ఎయిడ్ కిట్లు
- అలంకారప్రాయంగా బాక్సులు
- ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కూడా కరువే..





ఆర్టీసీ బస్సు (ఇన్‌సెట్లో) ఫస్ట్ ఎయిడ్ బాక్సు లేని బస్సు

పార్వతీపురం టౌన్: ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల భద్రతను గాలికి వదిలేశారు. ప్రయాణ సమయంలో ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు ఉంచాల్సిన ఫస్ట్ ఎయిడ్ కిట్లు బస్సుల్లో మచ్చుకైనా కనపడడం లేదు. పలు బస్సుల్లో బాక్సులు ఉన్నప్పప్పటికీ, అవి అలంకారప్రాయంగా మారాయనే చెప్పవచ్చు. అయితే బాక్స్‌ల్లో పూర్తి స్థాయిలో అన్ని వస్తువులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్న కనీస విషయాన్ని ఆర్టీసీ అధికారులు విస్మరించారు. ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది. మందుల కొనుగోలుకు నిధులు కేటాయించకపోవడంతో ఆర్టీసీ అధికారులు ఆస్పత్రులు, దాతల కోసం ఎదురు చూస్తున్నారు.

అధికారుల అలసత్వం..

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో మొత్తం 3 డిపోలున్నాయి. పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల్లో నిత్యం 20 వేల నుంచి 22 వేల వరకు ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బస్సుల్లో ఏర్పాటు చేయాల్సిన ఫస్ట్ ఎయిడ్ కిట్ల విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ సమయంలో కచ్చితంగా ప్రథమ చికిత్స గురించి తర్ఫీదిస్తారు. బాక్స్‌లో మందులు, సామగ్రి లేకపోవడంతో సిబ్బంది కూడా చేసేదిలేక గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

బాక్సుల్లో ఉండాల్సిన సామగ్రి..

స్టెరిలైజ్డ్ కాటన్ బండిల్స్–2, ఎలాస్టిక్ బాండేజ్ రోలర్స్–5, బెటాడియన్ ఆయింట్‌మెంట్ (యాంటీ సెప్టిక్ క్రీమ్)– 1, డెటాల్ లేక స్యాక్లాన్– 1, నియోసిన్ పౌడర్ డబ్బా–1, సర్జికల్ బ్లేడ్–1, బర్నాల్ ఆయింట్‌మెంట్–1, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, వైట్ ప్లాస్టర్ టేప్–1, బ్యాండ్ ఎయిడ్ ప్లాస్టర్, స్టెరిలైజ్డ్ ఎలాస్టిక్ ప్లాస్టర్లు మూడు ఉండాలి.

అన్ని బస్సుల్లో ఏర్పాటు..

జిల్లా పరిధిలోని ఆయా డిపోల అధికారులతో మాట్లాడి అన్ని బస్సుల్లో మెడికల్ కిట్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ వైద్య అధికారులతో మాట్లాడి కిట్ల ఏర్పాటుకు కృషి చేస్తాం. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటాం.

– కె. శ్రీనివాసరావు, డీపీటీఓ, పార్వతీపురం మన్యం

హామీల అమలు సంగతేంటి..?

- సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టారు
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం టౌన్: అలివిగాని హామీలిచ్చి గద్దె నెక్కిన కూటమి ప్రభుత్వం వంద రోజులైనా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండిపడ్డారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబు ఏనాడూ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల మందికి ఉద్యోగాలు, ప్రతి ఇంటికీ మూడు సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, తదితర హామీలను అటకెక్కించారని ఎద్దేవా చేశారు. వంద రోజుల టీడీపీ పాలనలో కక్ష సాధింపు చర్యలు, ప్రాజెక్టుల పేర్లు మార్పు, సెబ్ రద్దు, సీబీఎస్సీ సిలబస్ రద్దు తప్ప ఏమీ చేయలేదన్నారు. పేద విద్యార్థులు తెల్ల కోటు వేసుకునేందుకు వీల్లేకుండా వైద్య కళాశాలలకు అడ్డుకట్ట వేశారని ఆరోపించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో మాజీ ముఖ్యమంత్రి జగనన్న పులివెందులలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే.. ఎంబీబీఎస్ సీట్లు అవసరం లేదని కేంద్రానికి లేఖ రాయడం బాధాకరమన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చలేని కూటమి ప్రభుత్వం ప్రతిరోజూ ఏదో ఒక సమస్యను తెరపైకి తీసుకువచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు.

నోరుమెదపని బోనెల...

ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, డంపింగ్ యార్డు తరలింపు, యువతకు ఉపాధి కల్పన, తదితర అంశాలపై ఎన్నో హామీలిచ్చి నేడు నోరు ఎందుకు మెదపడం లేదని మాజీ ఎమ్మెల్యే జోగారావు ప్రశ్నించారు. గత పాలనకు.. ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను ప్రజలంతా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలు కూటమి నాయకులకు తప్పకుండా బుద్ధి చెబుతారన్నారు.

పార్వతీపురంలో తాగునీటి సమస్య



ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఐద్వా నాయకులు

పార్వతీపురం టౌన్: పట్టణంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, తరాలు మారినా సమస్య పరిష్కారం కావడం లేదని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. తాగునీటి సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) పార్వతీపురం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం పర్యటించి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాగావళి, జంఝావతి రెండు జీవ నదులు చెంతనే పారుతున్నా పార్వతీపురం పట్టణ ప్రజలకు తాగునీరు లేకపోవడం బాధాకరమన్నారు. రెండు, మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయం దగ్గర ఎన్జీఓ హోమ్ ఆఫీసులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని, తప్పకుండా పట్టణ మేధావులు, మహిళలు, ప్రజలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, శ్రామిక మహిళా సంఘ నాయకురాలు వి. ఇందిరా, ఐద్వా నాయకులు ఎం. గౌరి, సీఐటీయూ నాయకులు బి. సూరిబాబు, పి. సన్యాసి, ఎస్ఎఫ్ఐ నాయకులు పి. రాజశేఖర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

- ఐద్వా నాయకురాలు ఇందిర



డీఎంహెచ్ఓ విజయపార్వతికి వినతిపత్రం అందజేస్తున్న వి.ఇందిర, ఏఎన్ఎంలు

పార్వతీపురం టౌన్: సచివాలయ ఏఎన్ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలని ఐద్వా నాయకురాలు వి. ఇందిర అన్నారు. పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఎంహెచ్ఓ విజయపార్వతికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సుమారు 400 మంది గ్రేడ్ 3 ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నారని తెలిపారు. వీరిపై పనిభారం ఎక్కువగా ఉందన్నారు. సచివాలయ అధికారులతో పాటు వైద్యారోగ్య శాఖ అధికారులు కూడా టార్గెట్‌లు విధిస్తుండడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టండి

- సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ



పాడైన పైప్‌లైన్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని కొత్తవీధి పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. పట్టణంలోని కొత్తవీధి శివారులో పాడైన పైప్‌లైన్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మున్సిపాలిటీ అధికారులు పైపులైన్ల నిర్వహణ పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఐదు సంవత్సరాల నుంచి కొత్తవీధి శివారులో, త్రినాథస్వామి కోవెల పక్కన మెయిన్ పైపులైను లీకవుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, గౌరి, రాజు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను పరిరక్షించుకోవాలి

భామిని: గ్రామాల్లో ఉన్న ఉమ్మడి వనరులను పరిరక్షించుకోవాలని వెలుగు రిసోర్స్ పర్సన్ కె.దాసు నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డగూడలో ఆదివారం గ్రామమస్తులతో సమావేశమయ్యారు. ప్రజలందరికి ఉపయోగపడే కొండలు, వాగులు, చెరువులు, గెడ్డలు, గోర్జీలు, శ్మశానాలు, సామాజిక భవనాలు వంటివి ఉమ్మడి ఆస్తులుగా గుర్తించి వాటిని కాపాడుకోవాలని సూచించారు. ప్రకృతి వనరులను పరిరక్షించుకోవడం ద్వారా జీవ వైవిధ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. తద్వారా భావితరాల ప్రయోజనాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో మణిగ సర్పంచ్ కొండగొర్రి చంటి, వార్డు సభ్యులు, కోఆర్డినేటర్ గోపాల్, వెలుగు కార్యకర్తలు రామారావు, ఫకీర్, శైలజ, శారద, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



ఎమ్మెల్యే బి. విజయచంద్రకు రూ.50 వేలు అందిస్తున్న సత్యనారాయణ, శ్రీరాములు

సీతానగరం: మండలంలోని గాదెలవలస గ్రామానికి చెందిన బొన్నాడ సత్యనారాయణ, శ్రీరాములు వరద బాధితుల కోసం రూ. 50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను ఆదివారం కలిసి నగదు అందజేశారు. దీంతో ఎమ్మెల్యే విజయచంద్ర దాతలను అభినందించారు.

ఎంఈఓలకు వృత్యంతర శిక్షణ

పార్వతీపురం టౌన్: మండల విద్యాశాఖాధికారులకు ఆన్‌లైన్, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయ్‌రామరాజుకు ఆదివారం లేఖ రాశారు. పాఠశాలల పర్యవేక్షణతో పాటు పాఠశాల కార్యక్రమాలు, విద్యా పథకాలకు సంబంధించిన సమాచారాన్ని వివిధ రకాల యాప్స్ ద్వారా, ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు జిల్లా విద్యాశాఖకు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఎంఈఓలకు శిక్షణ ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు బదిలీ

సీతానగరం: మండల పరిషత్ అభివృద్ధి ఇన్‌చార్జ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న జావెద్‌కు ప్రకాశం జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇతను పార్వతీపురం ఎంపీడీఓగా పనిచేస్తూ, ఇక్కడ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. సీతానగరానికి రెగ్యులర్ ఎంపీడీఓను నియమిస్తారా.. లేదా మళ్లీ ఇన్‌చార్జ్ అధికారితోనే సరిపెడతారో వేచి చూడాలి.

సుందర నగరానికి కృషి..



సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పార్వతీపురం టౌన్: స్వచ్ఛమైన, సుందరమైన, ఆరోగ్యకరమైన పార్వతీపురం కోసం అందరూ కృషి చేద్దామని జట్టు ఆశ్రమ నిర్వాహకురాలు పద్మజ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆశ్రమంలో స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, వాణిజ్య, వర్తక సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని తీర్మానం చేశారు. అక్టోబర్ రెండు నుంచి ఒక ప్రణాళికతో ముందుకు సాగాలని నిర్ణయించారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్, జన విజ్ఞాన వేదిక, రెడ్‌క్రాస్ సొసైటీ, చెరువుల సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్.వై.నాయుడు

సాలూరు: సాలూరు నుంచి బాగువలస మీదుగా మక్కువ రోడ్డు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్.వై.నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. రోడ్డు బాగోలేదని కారణంగా సాలూరు నుంచి బాగువలస మీదుగా మక్కువ, దుగ్గేరు రెగ్యులర్ బస్ సర్వీసును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారన్నారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, లేదంటే ప్రజలందరితో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆయనతో పాటు పార్టీ కమిటీ సభ్యులు రవి, రాముడు ఉన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే అంత చులకనా?



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకం ఎప్పుడు?
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్య విద్య సీట్లు పెంచడం వల్లే మంత్రి సంధ్యారాణి కుమార్తెకు మెడికల్ సీటు
- ప్రతిభావంతులైన పేద విద్యార్థుల వైద్య విద్య కలలపై నీళ్లు చల్లిన కూటమి ప్రభుత్వం
- మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులు మరణిస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని, గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే అంత చులకనా అంటూ టీడీపీ కూటమి ప్రభుత్వంపై మాజీ ఉపముఖ్యమంత్రి, మాజీ గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర విరుచుకుపడ్డారు. పట్టణంలో తన గృహంలో ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పలువురు విద్యార్థులు అనారోగ్యంతో మరణిస్తున్నారని వాపోయారు. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇద్దరు గిరిజన విద్యార్థులు అనారోగ్యంతో మరణించారని తెలిపారు. కూటమి వంద రోజుల పాలనలో అల్లూరి జిల్లాలోనే సుమారు ఏడుగురు గిరిజన విద్యార్థులు మరణించినట్లు వివిధ మీడియాల్లో చూసినట్లు చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజన విద్యార్థులు మరణిస్తే అవి ప్రభుత్వ హత్యలంటూ ఆరోపణలు చేసిన మంత్రులు సంధ్యారాణి, లోకేష్ వీటిపై ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

గిరిజన శాఖామంత్రి తొలి సంతకం అమలయ్యేదెప్పుడు?

కూటమి ప్రభుత్వంలో గిరిజన సంక్షేమశాఖా మంత్రిగా తొలిసంతకం ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకంపై చేశానని చెప్పిన మంత్రి సంధ్యారాణి ఇప్పటివరకు ఏఎన్ఎంల నియామకం చేపట్టలేదన్నారు. ఆగస్టు 9 ఆదివాసీ దినోత్సవం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకం చేపడతామని, గిరిజన గ్రామాల్లో డోలీల మోత లేకుండా చేస్తామని, రహదారి సౌకర్యాలు కల్పిస్తామని, ఫీడర్ అంబులెన్స్‌లను పునరుద్ధరిస్తామని, వాటి సంఖ్య పెంచుతామని ప్రకటించారని, కానీ హామీల అమలు దిశగా ఒక్క అడుగు కూడా ముందుకువేయలేదని విమర్శించారు. ఇప్పటికీ గిరిజన ప్రాంతాల్లో సరైన రహదారి సౌకర్యం లేక రోగులను డోలీలపై ఆస్పత్రులకు మోసుకువెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయన్నారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖా మంత్రిగా తాను ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకం ఫైల్ పెట్టానని వివరించారు.

పేదల వైద్యవిద్య కలలపై నీళ్లు చల్లిన కూటమి ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటుచేశారని వివరించారు. నాడు వైద్య కళాశాలల్లో సీట్లు పెరగడం వల్లే ప్రస్తుత గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి కుమార్తెకు, రామభద్రపురం మండలానికి చెందిన మరో గిరిజన విద్యార్థినికి మెడిసిన్‌లో సీట్లు వచ్చాయని గుర్తుచేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేస్తూ, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల వైద్యవిద్య కలలపై నీళ్లు చల్లడం టీడీపీ కూటమి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు, నాయకులు అప్పారావు, షేక్ అబ్దుల్ పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



పార్వతీపురం టౌన్: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



బగ్గందొరవలసలో కాలువలో పూడికలు తీయిస్తున్న కార్యదర్శి శ్రీనివాస్

సీతానగరం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చురుగ్గా చేపడుతున్నట్లు స్వచ్ఛతా హి సేవ కో ఆర్డినేటర్ ఎం. రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బగ్గందొరవలసలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో కాలువల్లో పూడికలు తొలగించినట్లు తెలిపారు.

పార్వతీపురంలో ..

పార్వతీపురం టౌన్: స్వభావ స్వచ్ఛత – సంస్కార స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత అధికారి మహ్మద్ గయాజుద్దీన్ ఆధ్వర్యంలో పార్వతీపురం ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ నినదించారు. కార్యక్రమంలో పట్టణంలోని నాలుగు వసతిగృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం



అంతర పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: జీడిమామిడి తోటల్లో అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కోఆర్డినేటర్ భూషణరావు అన్నారు. ఎస్.కె.పాడు గ్రామానికి చెందిన కడ్రక సన్నాయి తన జీడితోటలో సాగు చేస్తున్న అంతర పంటలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సీసీ సుందరరావు ఆదివారం పరిశీలించారు. జీడితోటలో వేరుశనగ, చిక్కుడు, జనుములు, తోటకూర, గోంగూర, ఆనప, బీర, ముల్లంగి, టమోట, బెండ, బంతి తదితర పంటలను అంతర పంటలుగా సాగుచేస్తుండటంతో రైతును అభినందించా రు. అంతర పంటల సాగుతో జీడితోట శుభ్రంగా ఉండడంతో పాటు పంటలకు తెగుళ్ల ఆశించవన్నారు.